

# కళ్లు చెదిరే విజయం!

**లోపల** కంటి డాక్టరు. బయట కళ్లద్దాల దుకాణం. చాలారోజులపాటు ఇదే దృశ్యం కనిపించేది. ఈమధ్యనే పరిస్థితులు మారుతున్నాయి. బహుళజాతి సంస్థలు కూడా కళ్లద్దాల తయారీలోకి అడుగుపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో తన కుటుంబ వ్యాపారాన్ని దూకుడుగా విస్తరిస్తున్నారు బెంగాలీ యువతి ప్రియాంక గుప్తా. పాపులర్ బ్రాండ్ జీకేబీ ఆప్టికల్స్‌కు ఒకానొక డైరెక్టర్ తను. ఇది దేశంలోని తొలితరం కళ్లద్దాల తయారీ సంస్థలలో ఒకటని చెబుతారు. తండ్రి నుంచి వారసత్వంగా పగ్గాలు అందుకున్నారు ప్రియాంక. వివాహ వేడుకల్లో అతిథులంతా ఒకే థీమ్ కళ్లజోడు ధరించే ట్రెండ్ ప్రియాంక సృష్టించిందే. అందుబాటు ధరల నుంచి ప్రీమియం బ్రాండ్స్ వరకు అనేకం అందిస్తున్నారామె. ప్రియాంక నేతృత్వంలో దేశవ్యాప్తంగా 28 నగరాల్లో 90 అవుట్‌లెట్స్ ఉన్నాయిప్పుడు. 'వినియోగదారుడు మా స్టోర్ నుంచి చిరునవ్వుతో, సంతృప్తిగా బయటికి వెళ్లాలి. ఇదే నా లక్ష్యం' అంటారు ప్రియాంక.



నమస్తే తెలంగాణ

# జిందగీ

9

హైదరాబాద్ | బుధవారం 27 డిసెంబర్ 2023 www.ntnews.com


Fashion



## హే కృష్ణా..

**కృ**ష్ణ తత్వంలో ప్రేమతత్వం అంతర్లీనం. ప్రేమించే ప్రతి మనసులోనూ రాధాకృష్ణుడి అంశ ఉంటుంది. ప్రేమగా అలంకరించుకునే ప్రతి వస్త్రంలోనూ కృష్ణ చైతన్యం తొంగి చూస్తుంది. ప్రసిద్ధ డిజైనర్ నీతా లుల్లా కొత్త కలెక్షన్‌లోనూ గోపాల, గోవింద స్వరూపం గోచరిస్తున్నది.



# కొత్తగా.. పాత ఫర్నిచర్!

**కొత్తొక వింత.. పాతొక రోత అంటారు. కానీ కొత్త రోత, పాత మాత్రం ఎప్పుడూ ఓ వింతే అంటున్నారు జయ తులసి. కొత్త ఫర్నిచర్ కోసం మనిషి ఆరాటానికి అడవులు బలైపోతున్నాయి. వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. పర్యావరణ విధ్వంసం వల్ల జంతువుల ఆవాసాలు తగ్గిపోతున్నాయి. సముద్ర మట్టాలు పెరిగిపోతున్నాయి. ఈ సమస్యలకు తనవంతు పరిష్కారంగా పాత ఫర్నిచర్‌కు కొత్త హంగులు అద్దుతున్నారు 'బ్రౌన్ అండ్ టీల్' అధినేత్రి జయ తులసి. ఆ ఎకోఫ్రెండ్లీ ఆంత్రప్రెన్యూర్ అనుభవాలు, జ్ఞాపకాలు..**

**హైదరాబాద్** అబిడ్స్ ప్రాంతంలో పుట్టి పెరిగాను. కింగ్ కోఠిలోని సెయింట్ జోసెఫ్స్ నుంచి మాస్ కమ్యూనికేషన్స్‌లో పట్టా అందుకున్నాను. అప్పుడే, ఫొటోగ్రఫీ పట్ల ఆసక్తి కలిగింది. అంతలోనే, మణిపాల్ యూనివర్సిటీలో ఎంఏ డిజిటల్ మార్కెటింగ్‌లో సీటొచ్చింది. దీంతో, పీజీ తర్వాతే ఫొటోగ్రఫీని సీరియస్‌గా మొదలుపెట్టాను. చేతికొచ్చిన డబ్బుతో కెమెరా కొన్నాను. Two To Tango ఫొటోగ్రఫీ కంపెనీ పెట్టాను. పెళ్లిళ్లు, నిశ్చితార్థాలు, బారసాలలు, సీమంతాలు.. తదితర సంప్రదాయ వేడుకలే కాదు.. వాణిజ్య ప్రకటనల కోసం కూడా ఫొటోగ్రఫీ చేస్తున్నాను. మా అమ్మ ప్లే స్కూల్ నడుపుతుంది. నాన్న బిజినెస్ చేస్తారు. అక్కకు కాలేజ్ ఉంది. వీళ్లందరి మద్దతూ నాకుంది. కాబట్టే, అంత నిశ్చింత.

### నూరేళ్ల పంట

**'పెళ్లంటే** నూరేళ్ల పంట. దురదృష్టవశాత్తు, ఆ వేడుకలో వందేండ్లయినా మట్టిలో కలవని ప్లాస్టిక్ పదార్థాలను అలంకరణకు వాడుతున్నారు. ఇది తప్పు' అంటున్నారు తులసి. ఆమె 'డెకార్ బై వైట్ గార్డెన్' అనే వ్యాపారమూ నడుపుతున్నారు. ఈ సంస్థ నూటికి నూరుపాళ్లు ఎకో ఫ్రెండ్లీ డెకొరేషన్ చేస్తుంది. 'నెలకు ఒక ఈవెంట్ అయినా చేస్తాను కానీ, పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలు మాత్రం వాడను. అలా వాడమని ఎవరైనా ఒత్తిడి చేస్తే.. ఆ ఈవెంట్‌ను వదులుకుంటాను' అని స్పష్టంగా చెబుతారు తులసి.

### మాల్గుడి డేస్ స్ఫూర్తితో..

పీజీ రోజుల్లో ఉడుపిలోని పాత ఇళ్లు చూసేదాన్ని. ఆర్.కె. నారాయణ్ 'మాల్గుడి డేస్' కథలన్నీ అగుంబే రెయిన్ ఫారెస్ట్‌లోని కర్కలా అనే పల్లెటూరు నేపథ్యంలో సాగుతాయి. ఆ గ్రామం మణిపాల్‌కు కొద్ది దూరంలో ఉంటుంది. నేనూ అక్కడికి వెళ్లాను. ఆ ఇళ్లు, నిర్మాణ శైలి, ఫర్నిచర్, గృహాలంకరణ అద్భుతంగా అనిపించాయి. నిజానికి, మనకు కూడా అందమైన వారసత్వ సంపద ఉంది. దాన్నంతా చెత్తకుప్పలో విసిరేసి, పక్కా పాశ్చాత్యుల్లా మారిపోతున్నాం. కార్పొరేట్ కంపెనీలు తయారుచేసిన ప్లైవుడ్ ఫర్నిచర్ ఇంటికి తెచ్చుకుంటున్నాం.

### కొవిడ్ కాలంలో..

మా పాతింట్లో తాతలనాటి ఫర్నిచర్ చాలా ఉండేది. నాకు చాలా ఇష్టం. వాటిలో అందం, హుందాతనమే కాదు, నాణ్యతా ఉంటుంది. వాటిని మనం జాగ్రత్తగా కాపాడుకోవాలి. కానీ, మనవాళ్లు చిన్న మరమ్మతు వచ్చినా పక్కన పడేస్తున్నారు. వద్దనుకుంటే నిర్దాక్షిణ్యంగా పారేస్తున్నారు. రిపేరు చేసి మళ్లీ ఉపయోగించుకోవచ్చనే ఆలోచనే రాదు. ఆ ఆలోచన ఉన్నవారికేమో.. రిపేరు చేసే కార్పెంటర్లు దొరకడం లేదు. ఫలితంగా సంప్రదాయ గృహాలంకరణలు మాయమై పోతున్నాయి. వీటిని, ఎలాగైనా కాపాడుకోవాలని పించింది. కొవిడ్ సమయంలో దాదాపుగా ఈవెంట్స్ లేవు. ఉన్నా పది మంది, ఇరవై మందితో జరుపు కొనేవారు. ఆడంబరాలు లేని పెళ్లికి ఫొటోగ్రాఫర్లెందుకు? అనుకునేవారేమో. మాకూ ఆర్డర్లు తగ్గాయి. అప్పుడే, ఫర్నిచర్ మీదికి మనసు మళ్లింది. నగరంలోని బస్తీలన్నీ తిరిగి పాత ఫర్నిచర్ కొన్నాను. మా కింది పోర్షన్ ఖాళీ కావడంతో అక్కడే వర్క్‌షాప్ పెట్టాను. ఓ మంచి కార్పెంటర్‌ను పెట్టుకొని రిపేర్లు చేయించాను. అవసరమైతే సమూలంగా మార్పించాను. వాళ్లతో పని చేస్తూ నేనూ చెక్క పని నేర్చుకున్నాను. సోషల్ మీడియా ద్వారా ఆ ఫర్నిచర్ అమ్మాను. జనం ఇష్టంగా కొన్నారు. మంచి లాభం వచ్చింది. వ్యాపారం పెరగడంతో వర్క్‌షాప్‌ను మారేడ్‌పల్లికి మార్చాను. అట్నుంచి ఇండస్ట్రియల్ ఏరియాకు వెళ్లాను. ముగ్గురు కార్పెంటర్లు, పాలిష్-కేన్ వర్కర్లు పని చేస్తున్నారు. కొత్తగా మార్చిన పాత ఫర్నిచర్‌ను ఆన్‌లైన్‌లో అమ్ముతాను. ముంబై, చెన్నై తదితర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తాయి.



### చెట్లను కాపాడుకుందాం

అలవాట్లే కాదు, అభివృద్ధి విధానాలూ మారిపోతున్నాయి. ఫర్నిచర్ తయారీ కోసం చెట్లను కొట్టేయడం వల్ల అడవులు తగ్గిపోతున్నాయి. జంతువులకు ఆవాసాలు లేకుండా పోతున్నాయి. జంగల్ (బ్రౌన్)ను కాపాడితేనే నీల సముద్రాన్ని (టీల్) రక్షించుకోగలం. పాత కాలపు జ్ఞాపకాలను కాపాడుకుంటూ.. పర్యావరణ పరిరక్షణకు పాటుపడటమే 'బ్రౌన్ అండ్ టీల్' లక్ష్యం. ఆ ప్రయత్నంలో భాగం.. పాత ఫర్నిచర్‌ను పునర్వినియోగంలోకి తెస్తున్నాను. అన్నిచోట్లా ఇలాంటి ప్రయత్నాలు జరగాలి. పర్యావరణం గురించి అందరూ ఆలోచించాలి. జంతువులు బతకాలి. రేపటి తరాలూ బతకాలి.

... నాగవర్ధన్ రాయల

# మళ్లీ పాలు పడాలంటే..

జిందగీ క్లినిక్



**నమస్తే డాక్టర్. నా వయసు ముప్పై. నాకు నాలుగు నెలల బాబు ఉన్నాడు. గత నెలలో విపరీతంగా జ్వరం వచ్చింది. చాలా రోజులు యాంటీబయాటిక్స్ వాడాను. ఆ తర్వాత నుంచి పూర్తిగా పాలు రావడం లేదు. డాక్టర్ సూచనతో బిడ్డకు డబ్బాపాలు పడుతున్నాను. మళ్లీ నాకు పాలుపడే అవకాశం ఉందా? అందుకు ఏం చేయాలి?**

**• ఓ పాఠకురాలు**

**మీకు** పాలు తగ్గిపోవడం అనేది అనారోగ్యం వల్లనో, మందులు వాడటం వల్లనో జరగలేదు. సాధారణంగా జ్వరం వచ్చినప్పుడు తల్లుల ఒంట్లో శక్తి సన్నగిల్లుతుంది. ఓపిక లేకపోవడం వల్ల బిడ్డకు పాలు పట్టడం మానేస్తారు. అయితే, బిడ్డ సరిగ్గా తాగకపోతే పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. కొద్దిరోజుల పాటు స్థన్యం ఇవ్వకపోతే.. ఇక పాలు రావు. అందులోనూ డబ్బా పాలు పడుతున్నాం అంటున్నారు. అంటే, నాకు తెలిసి మీరు సీసాతో బిడ్డకు పాలు పట్టిస్తూ ఉంటారు. తల్లి దగ్గర పాలు తాగాలంటే బిడ్డ వాటిని రొమ్ము నుంచి గుంజుకోవాల్సి వస్తుంది. అందుకు కొంత శ్రమ అవసరం. కానీ సీసాలో పాలు సులభంగా నోట్లోకి వస్తాయి. తల్లి పాలతో పోలిస్తే తియ్యగా ఉంటాయి కూడా. బిడ్డ సీసా పాలకు అలవాటు పడినప్పుడు, తల్లి పాలుపట్టే ప్రయత్నం చేసినా తాగకుండా ఏడవడం ప్రారంభిస్తుంది. అయినా ఫర్వాలేదు. రెండు రోజుల పాటు మీ దగ్గరే తాగించే ప్రయత్నం చేయండి. బిడ్డ తాగుతూ ఉంటే పాలు తప్పక పడతాయి. తొలిరోజుల్లో బాబుకు పొట్ట నిండలేదని పిస్తే కొంచెం డబ్బాపాలు ఉగ్గుగిన్నెతో పట్టండి. సరిపోతుంది.



**డాక్టర్ పి. బాలాంబ**
సీనియర్ గైనకాలజిస్ట్

# ఐదు.. ప్రేమ భాషలు

**ప్రేమ పసిబిడ్డ లాంటిది, పసిమొక్క లాంటిది. జాగ్రత్తగా సంరక్షించుకోవాలి. ఇష్టంగా సాదుకోవాలి. ఆ ప్రయత్నంలో ఓ ఐదు ప్రేమ భాషలను భర్తలకు పరిచయం చేస్తున్నారు 'ఫైవ్ లవ్ లాంగ్వేజెస్' రచయిత గ్యారీ చాప్‌మన్.**

### 1 పనిలో సాయం

వంట పనిలో దూరండి. బట్టలు ఉతకడంలో సాయం చేయండి. వారాంతంలో దుమ్ము దులిపి ఆమెకు శ్రమ తప్పించండి.

### 2 బహుమతులు ఇవ్వండి

పెళ్లిరోజు, పుట్టినరోజు తదితర ప్రత్యేక సందర్భాల్లోనే కాదు.. ఆఫీసు నుంచి ఇంటికి వస్తూ వస్తూ కూడా ఏదైనా కానుక తీసుకెళ్లొచ్చు. ఆమెను సర్‌ప్రైజ్ చేయవచ్చు.

### 3 మాటే మంత్రం

తను ప్రత్యేకంగా అలంకరించుకున్నప్పుడు ప్రశంసించండి. తన చేతి వంట బాగా కుదిరినప్పుడు మనసారా మెచ్చుకోండి. తన పట్ల మీ ప్రేమను వ్యక్తం చేయండి. తను ఊరికి వెళ్లినప్పుడు ఎంతగా మిస్ అవుతారో కవితాత్మకంగా వివరించండి.


### 4 తనకంటూ సమయం

ఓ భర్త ప్రపంచంలోనే ఖరీదైన గడియారాన్ని తన భార్యకు కానుకగా ఇచ్చాడు. 'ఇంతకంటే విలువైంది కావాలి. మీ సమయం' అని సూటిగా జవాబిచ్చింది భార్య. ఎన్ని పనులున్నా రోజూ ఆమెకు కాసింత సమయం ఇవ్వండి. అందులో చొరబాట్లు, కోతలు వద్దు.



### 5 ఆత్మీయ స్పర్శ

చేతిలో చెయ్యి వేయండి, దగ్గరికి తీసుకోండి, ముద్దు పెట్టుకోండి.. ప్రేమ పూర్వక స్పర్శ ఏ రూపంలో అయినా ఉండొచ్చు.



## ▪ వస్త్రం.. కళా అస్త్రం



**సూత్ర** సంతతి.. వినగానే కొత్తగా అనిపిస్తుంది. మనకు మానవ సంతతి మాత్రమే తెలుసు. ముత్తాత, తాత, నాన్న, మనం, మన పిల్లలు.. అంతే! ఆమాటకొస్తే వస్త్రానికి సైతం ఓ ఘనమైన వారసత్వం ఉంటుంది. ఆ వంశవృక్షాన్ని ఎవరూ రికార్డు చేయకపోవడం వల్ల.. మనిషి నిర్లక్ష్య-నిర్లిప్తతల ఫలితంగా కొన్ని అరుదైన దారపు పోగులు కనిపించకుండా పోతున్నాయి. అపురూపమైన వస్త్రకళలు అంతరించిపోతున్నాయి. ఈ దుస్థితిని నివారించి.. ప్రతి పోగునూ జాగ్రత్తగా సంరక్షించుకోవాలన్నదే 'సూత్ర సంతతి' లక్ష్యమని చెబుతారు ఆ సంస్థ క్యూరేటర్ లవీనా బల్డోట. ఇప్పటికే నూట ఇరవై అయిదుకుపైగా వస్త్ర ఆధారిత కళా రూపాలను సేకరించారామె. వాటిని ముంబైలోని ఓ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనకు పెట్టారు. రవివర్మ చిత్రాలను స్ఫూర్తిగా తీసుకొని.. చీరలపై నేసిన చిత్రాలూ అందులో ఉన్నాయి.

## ▪ సుగంధ యోగ

**యోగాతో** ఎన్ని లాభాలో ప్రత్యేకించి చెప్పాల్సిన పన్లేదు. పాశ్చాత్యులు సైతం యోగా థెరపీని అంగీకరిస్తున్నారు. సువాసనలతో మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అరోమా థెరపీ పట్ల కూడా నమ్మకం పెరుగుతున్నది. ఈ రెండిటి కలయిక అరోమా యోగా. యోగ సాధన సమయంలో సుగంధ ధూపాలను వెలిగిస్తే చాలా ఉపయోగాలు ఉంటాయంటారు థెరపిస్టులు.



- యోగాకు అరోమాథెరపీ జోడిస్తే.. మనసుకు మరింత ప్రశాంతత లభిస్తుంది. లోతైన ధ్యానస్థితికి చేరే అవకాశం ఉంటుంది.
- నిమ్మగడ్డి, లావెండర్ లాంటి సుగంధాలు నాడీవ్యవస్థ మీద సానుకూల ప్రభావాన్ని చూపుతాయి.
- మన చుట్టూ ఉండే 'ఆరా'ను మరింత శక్తివంతంగా మార్చేందుకు, షట్చక్రాలను ఉత్తేజితం చేసేందుకు కూడా యోగా ప్లస్ అరోమాథెరపీ సాయపడుతుంది.
- ఆసన, ధ్యాన సమయాల్లో సుగంధ ధూపాలు మనలో ఆధ్యాత్మిక ప్రకంపనలు కలిగిస్తాయి. మార్మికతను పంచుతాయి.